# SAVE RGUKT…

# ఆర్జీయుకేటీని బ్రతుకనీయండి…

ప్రతిభావంతులైన గ్రామీణ పేద విద్యార్థులకు రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం – ట్రిపులైటి బాసర ఒక వరం. ఈనాటి వరకూ ఎన్నో వేలమంది విద్యార్థులకు విద్యాదానం చేసి, మరెందరో విద్యార్థులకు విద్యనందిస్తూ తెలంగాణలో అత్యుత్తమ విశ్వవిద్యాలయంగా అందరి మన్ననలను పొందుతుంది. ప్రస్తుత ప్రభుత్వం మరియు విశ్వవిద్యాలయ పరిపాలనా యంత్రాంగం యొక్క సమర్థవంతమైన నాయకత్వంలో, క్యాంపస్ అంతటా శాంతియుతమైన వాతావరణం నెలకొంది.

సుమారు 9000 మంది విద్యార్థులు మరియు 1000 మంది సిబ్బందితో ఉన్న ప్రస్తుత క్యాంపస్, కేవలం ఏడాది కాలంలోనే అపూర్వమైన అభివృద్ధిని సాధించింది. గతంలో విద్యార్థులు ఎదుర్కొన్న మౌలిక వసతులకు చెందిన ఇబ్బందులు పునరావృతం కాకుండా మౌలిక వసతుల పునర్నిర్మాణంపై ప్రత్యేకదృష్టి పెట్టి అభివృద్ధిని కొనసాగించడం జరుగుతున్నది.

2025 నుంచి ఆర్జీయుకేటి ప్రముఖ పరిశ్రమలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలతో అవగాహన ఒప్పందాలను కుదుర్చుకుంది. సిలబసులను పునరీక్షించడం (**Revised Syllabus**), కౌన్సిలింగ్ వ్యవస్థను పటిష్టపర్చడం, 2025-26 విద్యాసంవత్సరం నుండి, ఆర్జీయుకేటి-వాసరలో కొన్ని ఎంపిక చేసిన విభాగాలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ కార్యక్రమాన్ని అందిస్తోంది. ఈ కార్యక్రమాలు విద్యార్థులలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన ధోరణి మరియు పరిశ్రమ-సంబంధిత పద్ధతులకు ప్రత్యక్ష పరిచయం కల్పించడానికి రూపొందించబడ్డాయి. ఈ సంవత్సరం నుండి, పిహెచ్.డి. అధిక నాణ్యత పరిశోధన మరియు ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి కార్యక్రమాలు ప్రవేశపెట్టబడుతున్నాయి. డాక్టరేట్ కార్యక్రమాలు సామాజిక సవాళ్లను పరిష్కరించడం, ఇంటర్డిసిప్లినరీ పరిశోధనలను

ప్రోత్సహించడం మరియు ప్రభావవంతమైన ఆవిష్కరణల ద్వారా జాతీయ అభివృద్ధికి దోహదం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది ఆర్జీయుకేటి.

విశ్వవిద్యాలయ నిధుల విషయంలో **Budget Estimation** (బడ్జెట్ అంచనా), **Budget Allotment** (బడ్జెట్ కేటాయింపు), మరియు **Budget Release** (బడ్జెట్ విడుదల) మధ్య ఉన్న వ్యత్యాసాన్ని సరిగ్గా అర్థం చేసుకోకుండా అపోహపడి, వీటి మధ్య ఉన్న సాంకేతిక తేడాలను గమనించక కొందరు దుష్ప్రచారం చేయడం జరుగుతున్నది. ప్రభుత్వం నుంచి గత 5 సంవత్సరాలలో విడుదల కానటువంటి సుమారు 57 కోట్ల రూపాయలను, నిధుల అవకతవకలుగా చిత్రీకరించి సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తూ బాధ్యతారాహిత్యంగా దుష్ప్రచారం చేస్తూ విశ్వవిద్యాలయ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారు. ఇట్టి రిలీజ్ కానటువంటి నిధులకు సంబంధించిన అంశాలను ప్రభుత్వ యంత్రాంగం ద్వారా కూడా తెలుసుకోవచ్చు.

ప్రభుత్వం ప్రతి ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ కెటాయింపు జరుగుతుంది. బడ్జెట్ కేటాయింపు అయిన తర్వాత, బడ్జెట్ విడుదల అనేది నెలవారిగా కానీ, త్రైమాసికంగా గానీ కేటాయించి విడుదల చేస్తారు. నిధుల విడుదల ప్రక్రియ అన్ని ప్రభుత్వ సంస్థలు, విశ్వవిద్యాలయాలు, ఇతర ప్రభుత్వ విద్యాలయాలు మొదలైన వాటికి ఈ విధంగానే జరగడం పరిపాటి. అయితే కొన్ని సందర్భాలలో కేటాయించబడిన నిధుల మొత్తానికి సరిసమానమైన నిధులు విడుదల కాని సందర్భాలు కూడా ఉంటాయి. ఇలాంటి సంఘటనలు పలు విశ్వవిద్యాలయాలలో, ప్రభుత్వ రంగ సంస్థలలో గతంలో జరిగిన దాఖలాలున్నాయి. అదే విధంగా ఆర్జీయుకేటీ బాసరకు కూడా **Budget Estimation** (బడ్జెట్ అంచనా), **Budget Allotment** (బడ్జెట్ కేటాయింపు), **Budget Release** (బడ్జెట్ విడుదల) విషయంలో కూడా ఇదే జరిగింది.

విద్యార్థి మనీశ్ రెడ్డికి సంబంధించిన సమస్యను గతంలోనే అతని తల్లిదండ్రులను పిలిపించి, చర్చించి సానుకూల వాతావరణంలో పరిష్కరించాం. తిరిగి పరీక్షలకు రిజిస్ట్రేషన్ చేసుకోవడం, పరీక్షలు రాయడం కూడా జరిగింది.

ఈ విద్యాలయానికి వచ్చే విద్యార్థులలో బడుగు, బలహీన వర్గాల నుంచి వచ్చే మొదటి తరానికి చెందినవారే అధికం. ఎందరో విద్యార్థులు ఇక్కడ సీటు సంపాదించి తమ భవిష్యత్తును బంగారుమయం చేసుకోడానికని వచ్చేవారే. కానీ, కొంతమంది మాత్రం తమ వ్యక్తిత్వ పరమైన విలువలను వదిలివేసి, స్వార్థప్రయోజనాలకై అనైతికంగా ప్రవర్తిస్తూ తోటి విద్యార్థుల భవిష్యత్తుతో, విశ్వవిద్యాలయ ప్రతిష్ఠతో చెలగాటం ఆడుతున్నారు. విద్యాలయాన్ని ఎప్పుడూ వివాదాలలో ఉంచడం కొంతమందికి నిత్యకృత్యమైంది. ఇది విద్యార్థుల ఉద్యోగ నియామకాలపైన (**Placements**) కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తుంది. ఇలాంటి అవాంఛనీయ, అనాలోచిత చర్యల వల్ల తాము కూర్చున్న కొమ్మను తామే నరుక్కుంటున్నామన్న సంగతిని కొంతమంది విస్మరిస్తున్నారు.

విశ్వవిద్యాలయ విధివిధానాలనుసరించి పరిపాలన జరుగుతుంది. ప్రతి విషయంలో పారదర్శకత గోచరిస్తుంది. విశ్వవిద్యాలయం ఒక ప్రభుత్వ సంస్థ.

విశ్వవిద్యాలయం విద్యార్థుల భవిష్యత్తుకు బంగారుబాట వేయడానికి అహర్నిశలు శ్రమిస్తున్నది. ఇక్కడ చదివిన ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా ఉపాధి కల్పించే దిశగా ఎన్నో సంస్థలతో పరస్పర అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకుంటుంది. ఒక ప్రక్క ప్రభుత్వాలు విద్యావ్యవస్థను పటిష్టం చేయడానికి 'రైజింగ్ తెలంగాణ – 2047', 'వికసిత్ భారత్ – 2047' మొదలైన కార్యక్రమాలతో కృషి చేస్తుంటే, కొందరు మాత్రం తమ స్వార్థప్రయోజనాల కోసం ఆర్జీయుకేటి ప్రతిష్ఠను దిగజార్చడమే పనిగా పెట్టుకున్నారు. ఇందులో కొంతమంది అధ్యాపకుల పాత్ర కూడా ఉందని వినిపించడం దిగ్భ్రాంతికరం, శోచనీయం.

విద్యాపరమైన సంస్కరణలతో విశ్వవిద్యాలయ భవిష్యత్ ప్రణాళికలను రూపొందిస్తూ, ప్రభుత్వం రూపొందించిన 100 రోజుల కార్యక్రమాలతో పాటు, న్యాక్ (**National Assessment and Accreditation Council**), ఎన్.బి.ఎ.( **National Board of Accreditation** ) లాంటి కార్యక్రమాలలో విశ్వవిద్యాలయం నిమగ్నమై ఉండగా మరోవైపు బడ్జెటుకు సంబంధించి

కనీసమైన అవగాహన కూడా లేకుండా నిధుల దుర్వినియోగమని పత్రికా ప్రకటన ద్వారా విశ్వవిద్యాలయ గౌరవాన్ని దిగజార్చడం మరియు విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. విద్యార్థులందరూ ప్రస్తుతం అకడమిక్ ఆక్టివిటిస్ లో, పరీక్షలకు తయరవ్వడంలో, రాయడంలో, ముఖ్యంగా ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఇంటర్న్ షిప్స్, ప్రాజెక్టు పనుల్లో నిమగ్నమై ఉండగా ఇలాంటి అవాంఛనీయమైన మరియు తప్పుదోవ పట్టించే దురుద్దేశపూరితమైన సంఘటనలు ఇటు నిజమైన క్యాంపస్ విద్యార్థులను అటు వారి తల్లిదండ్రులను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. కావున విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు ఇలాంటి అవాస్తవమయమైన విషయాల పట్ల అప్రమత్తంగా ఉంటూ, తమ భవిష్యత్తును, విశ్వవిద్యాలయ ఉనికిని కాపాడుకుంటూ, బాధ్యతను తెలుసుకొని జాగ్రత్తవహించాలని ఆర్జీయుకేటీ విజ్ఞప్తి చేస్తుంది.